

# కృతి – ఆకృతి

## – అపర్ణ మునుకుట్ల గునుపూడి



## 10

ఈ శీర్షిక ఉద్దేశ్యం కర్ణాటక సాంప్రదాయ సంస్కృతాంధ్ర కృతులలో భాష, రాగ, భావములను ప్రస్తావించి, మీకు శ్రావ్యానుభూతి కోసం ఆ కృతిని కూడా జత పరిచి మీ కందించాలని. ఈ కృతులందరికి తెలిసినవే అయినా వాటి సాహిత్య, రాగ, భావ ప్రకటనలు తెలిసేక మళ్ళీ విన్నప్పుడు ఆ కృతియొక్క ఆకృతిలో మీకు మరొక కోణం కనిపించవచ్చునేమో అన్నదే మా ఆలోచన, ఈ చిన్ని ప్రయత్నం.

గమనిక: పల్లవి, అనుపల్లవి, చరణములు ఉండి, సంగీత ప్రాధాన్యత కలిగి పెక్కు సంగతులతో రాగసంచార, భావప్రస్తారమునకు వీలుగా, స్వరకల్పనలో పాండిత్య ప్రతిభను ప్రదర్శించు విధముగా ఉన్నటువంటివి కృతులు. పల్లవి, అనుపల్లవి, పెక్కు చరణములు కలిగి ఒకే పద్ధతిలో గానము చేయగలిగి, భావ ప్రాధాన్యత కలిగినటువంటివి కీర్తనలు.

గాత్రం: తేజస్విని నందిభట్ల మరియు రమ్య శ్రీ కామరాజు

రచన: ముత్తుస్వామి దీక్షితులు

రాగం: హుసేని

తాళం: ఝంపె తాళం

Click Here to Watch

పల్లవి:

శ్రీ కాళహస్తీశ శ్రితజనావన

సమీరాకార మాం పాహి రాజమౌళే ఏహి

అనుపల్లవి:

పాకారి విధి హరి ప్రాణమయ కోశ అనిలాకాశ
భూమి సలిల అగ్ని ప్రకాశ శివ

చరణం:

జ్ఞానప్రసూనాంబికా పతే భక్తాభిమాన దక్షిణ కైలాస వాస

అభీష్ట దాన చతుర కరాబ్జ దీన కరుణానిధే

సూన శర సూదన అజ్ఞాన హర పశుపతే

జ్ఞాన గురుగుహ సచ్చిదానంద మయమూర్తే

హీనజాతి కిరాతకేన పూజిత కీర్తే

ఇది దక్షిణ కైలాసం గా ప్రసిద్ధి గాంచిన శ్రీ కాళహస్తి లో వాయులింగ రూపంలో వెలసిన శ్రీ కాళహస్తీశ్వరుని పై రచించిన కృతి. సమీరం అంటే పిల్ల వాయువు/గాలి. సమీరాకారంలో ఉన్న ఈశ్వరుడిని, స్రిత జనులు కొలిచే, రాజులకెల్లం రాజైనటువంటి వానికి పాహిమాం అంటూ, అనుపల్లవిలో ఇంద్రుడు, బ్రహ్మ, విష్ణువు మొదలైన వారికి ప్రాణమయమైన వాయువు రూపంలో ఉన్న శివుడు, తక్కిన భూతములైన ఆకాశం, భూమి, నీరు అగ్నిలోను కూడా ప్రకాశిస్తూ ఉన్నాడని అంటారు దీక్షితులవారు. జ్ఞానప్రసూనాంబా పతి అయిన ఈశ్వరుడు, భక్తులకు అభిమాని, దాన చతురుడు, కరుణాకరుడు, మన్మథుడిని క్రోధాగ్నిలో భస్మం చేసినవాడు, అజ్ఞానాన్ని హరించేవాడు, పశుపతి, జ్ఞానియైన గురుగుహకి చిదానంద మయుడు, కిరాతకుడైన తిన్నడు పూజించిగా ముక్తి ప్రసాదించిన వాడు అని వర్ణిస్తారు. పార్వతి దేవి శివునికై

తపస్సు చేస్తే, శివుడు అనుగ్రహించి పంచాక్షరీ మరియు వివిధ మంత్రోపదేశం, జ్ఞాన బోధ చేసి సిద్ధిని ప్రసాదిస్తాడు. అందుకే ఆవిడ అత్యత్భుతమైన శక్తిగల జ్ఞాన ప్రసూనాంబికగా మహిమాన్వితమైన అమ్మవారుగా పేరుగాంచింది.

ఈ క్షేత్రాన్ని, కృతిని సునిశితంగా పరిశీలిస్తే శివుడు సకల జనావళికే కాకుండా, క్రిమి, కీటకాది జంతుజాలములకు కూడా దేవ దేవుడని తెలుస్తుంది. ఎందుకంటే ఇక్కడ సాలె పురుగు (శ్రీ), పాము (కాళము), మరియు ఏనుగు (హస్తి), ఈ మూడు కూడా శివలింగానికి సపర్యలు చేసి, సేవించుకుని తరించేయి కనకే శ్రీ కాళహస్తి అనే పేరు స్థిరపడింది అంటారు. సాలెపురుగు గూడుకట్టి శివలింగం మీద ఆకులూ అలములు పడకుండా చూసుకుంటే, పాము శివలింగంపై ఎండ పడనీయకుండా తన పడగ వేసి కాపు పెట్టగా, ఏనుగు తన తొండంతో స్వర్ణముఖి నది నుండి నీళ్లు తెచ్చి లింగానికి అభిషేకం చేసేదిట. ఇవన్నీ శివసంకల్పమా లేక యాదృచ్ఛికమా అన్నది ఆ శివునికెఱుక! కానీ శివుడికి అభిషేకం చేయించుకోవడం ఇష్టం కదా! అందుకేనేమో "అభిషేకప్రియో శివ: అలంకారప్రియో విష్ణు:" అన్నారు. మార్కండేయుడికి గురూపదేశం చేసినది కూడా ఈ క్షేత్రంలోనే.

ఇక ఈ కృతిలో దీక్షితులవారు "హీనజాతి కిరాతేన పూజిత" అన్న అత్భుతమైన ప్రయోగం చేసి, శివుడికి హెచ్చు తగ్గు తారతమ్యాలు ఉండవని మనందరికీ గుర్తు చేస్తారు. ఇక్కడ హీనజాతి కిరాతుడు తిన్నడు. తిన్నడు పరమ శివ భక్తుడు. తనకు తోచిన విధంగా అక్కడి శివలింగానికి పూజలు చేస్తూ కాలం గడిపేవాడు. ఇలా ఉండగా, ఒకనాడు భూకంపం వస్తే అందరు చెల్లాచెదురై పరుగెత్తగా, తిన్నడు మాత్రం ఆలయం వదలకుండా అక్కడి శివలింగానికి ఏ ఆపదా రాకుండా దాన్ని కట్టుకుని అక్కడే ఉండిపోతాడు. ఉపద్రవం తీరేక, అక్కడ పడిన దుమ్ము ధూళి దులుపుతూండగా శివుడి ఒక కంట్లోంచి రక్తం వస్తుండడం గమనించి, వెంటనే, తన కన్ను ఒకటి పీకి అక్కడ పెడతాడు. ఆ తర్వాత రెండో కంట్లోంచి రక్తం రావడం కనపడుతుంది. తన రెండో కన్ను పీకి పెడదామనుకుని, కన్ను పీకిన తర్వాత ఆ కన్ను ఎక్కడ పెట్టాలో కనపడదు కనక, అతని కుడికాలి బొటనవేలుతో ఆ కన్ను దగ్గర ఆనవాలు పెట్టుకుని అప్పుడు కన్ను తీయడానికి ప్రయత్నిస్తుండగా అతని నిశ్చల భక్తికి పరవశుడై, శివుడు ప్రత్యక్షమై తిన్నడి పనిని ఆపి, అతని రెండో కన్నుకూడా ప్రసాదించి, మోక్షం ప్రసాదిస్తాడు. అందుకే అతనికి కన్నప్ప అన్న పేరు వస్తుంది. భగవంతుడికి నియమం, నిజాయితి, భక్తి తత్పరత తప్ప భక్తుడి కుల, మత, అంతస్తులతో అవసరం లేదని విశదించిన ఎన్నో పురాణగాథల్లో ఇది ఒకటి.

ఈ సందర్భంలో ధూర్జటిగారి కాళహస్తీశ్వర శతకంలో పై భావాన్ని అతి సరళంగా వివరించిన ఓ పద్యం చెప్పుకోక తప్పదు.

ఏ వేదంబు పఠించె లూత, భుజగం బే శాస్త్రముల్ జూచె

దానే విద్యాభ్యాస్యనంబొనర్చె కరి, చెంచే మంత్రమూహించె

బోధావిర్భావ నిధానముల్ చదువులయ్యా గావు నీ పాద

సంసేవాసక్తియె గాక జంతు తతికిన్ శ్రీ కాళహస్తీశ్వరాII

భగవంతుడికి పాదసేవ చేయాలన్న ఆసక్తి ఒక్కటి చాలు. వేదాలు, శాస్త్రాలు, విద్యలు, మంత్రాలు ఏవీ అక్కరలేదు అంటారు. ఎంత గొప్ప భావం.

కృతిలో ప్రాణమయ కోశ అన్న పదం వాడతారు దీక్షితుల వారు. జీవికి పంచప్రాణాలు. అవి అన్నమయ, ప్రాణమయ, మనోమయ, జ్ఞానమయ ఆనందమయ. ఈ ప్రాణాలు అన్ని కూడా వాయువుతో కూడినవి, కనకే వాయువు లేనిదే ప్రాణం లేదు. అందుకే విశ్వ వ్యాప్తమైన వాయువు అంత ప్రాముఖ్యం. దాన్ని కలుషితం చేయకుండా శుద్ధంగా ఉంచడానికి మనందరికీ శక్తినిమ్మని వాయులింగంగా వెలిసిన ఆ శివుణ్ణి వేడుకుంటూ, అలాగే ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే అగ్ని వెంట వాయువు విజృభించి, దాన్ని ప్రభంజనం చేయకుండా కాస్త సహనంగా సమీరంగా నిలిచి ఉండాలని భక్తితో సవినయంగా కోరుకుంటున్నాను.

సంగీతం ఇదం పుణ్యం సంగీతం ఇదం సౌఖ్యం
సంగీతం ఆరోగ్యప్రదం సంగీతం శాంతియుతం

తేజస్విని నందిభట్ల, డా. శేషు లత విశ్వనాధ్ గారి శిష్యురాలు.  సంగీతంలో ఎం.ఎ పట్టానందుకుని, పాడుతా తీయగా వంటి ప్రదర్శనల్లో, వివిధ దేశాల్లో కచేరీలు చేసి పెక్కు ప్రశంసలందుకున్న గాయని.

రమ్యశ్రీ కామరాజు, డా. శేషు లత విశ్వనాధ్ గారి శిష్యురాలు. సంగీతంలో ఎం.ఎ పట్టానందుకుని, ఆకాశవాణి, దూరదర్శన్ లో కర్ణాటక సంగీత గాయని. టీవీ ప్రదర్శనలు, సప్తగిరి, నాదనీరాజనం, కీర్తన సంకీర్తనల్లో పాల్గొని విరివిగా కచేరీలు చేస్తుంటారు.

COMMENTS